సాక్షి అనకాపల్లి

శనివారం | 5 | అక్టోబర్ | 2024



ధనలక్ష్మిగా కనకమహాలక్ష్మి

విశాఖలో కనకమహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష చామంతులతో పూజ చేశారు. 6లో



నైపుణ్యాలు మెరుగుపడేలా..

పాయకరావుపేటలో మూడు రోజులుగా జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్–7 పోటీలు ముగిశాయి. 6లో



విద్యార్థులకు నోటీసులు

ఎంవీపీకాలనీ: ర్యాగింగ్‌కు పాల్పడిన ఆర్కిటెక్చర్ విద్యార్థులను 15 రోజులపాటు సస్పెండ్ చేయనున్నట్లు ఏయూ వెల్లడించింది.



లడ్డూలో కాదు.. కూటమిలోనే కల్తీ



సుప్రీం నిర్ణయం చంద్రబాబుకు చెంపపెట్టు



- తిరుపతి లడ్డూ వ్యవహారం సీబీఐకి అప్పగించడంపై సర్వత్రా హర్షం
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశం
- భగవంతుడిని రాజకీయాల్లోకి లాగడంపై ధర్మాసనం ఆగ్రహం
- సుప్రీం తీర్పుతో ఉలిక్కిపడుతున్న కూటమి నేతలు
- తప్పు జరిగితే దేవుడే చూసుకుంటాడంటున్న సామాన్యులు
- రాజకీయ లబ్ధి కోసం దేవుడ్ని వాడుకోవడంపై మండిపాటు

పవిత్రమైన తిరుపతి లడ్డూను రాజకీయ దుర్బుద్ధితో అపవిత్రం చేసేశారు. వందరోజుల పాలన వైఫల్యాల్ని కప్పిపుచ్చుకునేందుకు విష రాజకీయాలకు తెరతీశారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిపేశారంటూ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని లేపాయి. రెండు రోజుల తర్వాత.. కల్తీ నెయ్యి అనీ.. మరికొద్ది రోజుల తర్వాత.. లడ్డూలో కలవలేదనీ.. కలవకుండా ఆపేశామంటూ పూటకోమాట మార్చేస్తూ.. భక్తుల మనోభావాలతో రాజకీయ చదరంగ మాడారు. దీనిపై నిష్పాక్షికమైన దర్యాప్తు జరిపించాలంటూ వైఎస్సార్‌సీపీ తరఫున రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చంద్రబాబు, అండ్ కో చేసిన వ్యాఖ్యలపై భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలాంటి ఆధారాల్లేకుండా.. దేవుడిని రాజకీయాల్లోకి లాగారంటూ మండిపడింది. చేసిన తప్పుడు వ్యాఖ్యల్ని సమర్థించుకునేందుకు కూటమి ప్రభుత్వం.. రాష్ట్ర పోలీసులతో సిట్ పేరుతో ఆడాలనుకున్న నాటకాలకు ధర్మాసనం స్వస్తి పలికింది. లడ్డూ వ్యవహారం సీబీఐకి అప్పగించి.. స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కుటిల స్వార్థంతో భగవంతుడిని రాజకీయాల్లోకి లాగారంటూ ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. సుప్రీం తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని అభిప్రాయపడుతున్నారు. తప్పు జరిగితే దేవుడే చూసుకుంటాడనీ.. తప్పుడు ఆరోపణలు చేసినా.. ఏడుకొండల వాడు విడిచి పెట్టరంటున్నారు. మతజ్వాలలు రగిలించేలా ప్రభుత్వ వ్యవహారంపై చిన్నా పెద్దా తేడాలేకుండా.. యావత్ ఆగ్రహిస్తున్నారు. అసలు లడ్డులో కల్తీ లేదనీ.. కూటమి ప్రభుత్వం చేసిన విషప్రచారంలోనే ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. – సాక్షి, అనకాపల్లి

వెంకన్న జోలికొస్తే మసైపోతారు..



హిందువుల ఆరాధ్యదైవం తిరుపతి వెంకన్నను రాజకీయాల్లోకి లాగి అసత్య ఆరోపణలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారు. ఈరోజు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులంతా స్వాగతిస్తున్నారు. లడ్డూ ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేసిన చంద్రబాబు తలదించుకొనేలా సుప్రీం తీర్పు ఇచ్చింది.

– కర్రి వెంకటేశ్వరరావు, ఎస్.రాయవరం, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షుడు

తీర్పును స్వాగతిస్తున్నాం..



తిరుపతి లడ్డూ ప్రసాదం వివాదంలో వాస్తవాలు వెలుగులోకి తేవడానికి సుప్రీం కోర్టు స్వతంత్ర దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. సీఎం చంద్రబాబు ఆరోపణలు చేసి.. ఆయనే సిట్ ఏర్పాటు చేస్తే నిజాలు బయటకు రావు. అందుకే సుప్రీం కోర్టు తీర్పు కోట్లాదిమంది భక్తుల విశ్వాసాన్ని పెంచే విధంగా ఉంది.

– వేచలపు సింహాద్రప్పుడు, విశ్రాంత టీచర్, వి.సంతపాలెం గ్రామం, కె.కోటపాడు మండలం

నిజం నిగ్గు తేలుతుంది



దేవుడంటే భయం, భక్తీ లేకుండా చంద్రబాబు తప్పుడు ప్రచారం చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ మీద హిందువులెవ్వరికీ నమ్మకం లేదు. అందుకే ప్రజలకు నిజానిజాలు తెలియాలనే టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తులు స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నాం. భక్తుల అనుమానాలు నివృత్తి కావాలంటే ఇదే సరైన మార్గం.

– బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

సుప్రీం తీర్పు చెంపపెట్టు



వందరోజుల్లో చేసిందేమీ లేక ప్రజల దృష్టి మళ్లించేందుకే తిరుపతి వెంకన్నను రాజకీయంలోకి లాగారు. లడ్డూ ప్రసాదం విషయంలో సీఎం చంద్రబాబు బహిరంగంగా ప్రకటన చేయడం కోట్లాది హిందువులను ఎంతో బాధించింది. సుప్రీంకోర్టు తీర్పు వారికి చెంపపెట్టు. స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయాలని తీర్పు రావడం హర్షనీయం.

– సూరెడ్డి కొండనాయుడు, పొక్లెయిన్ డ్రైవర్, పాములవాక, కోటవురట్ల మండలం

ప్రజల దృష్టి మరల్చడానికే..



నిరాధారమైన ఆరోపణలు చేసిన చంద్రబాబుకు తగిన గుణపాఠం తప్పదు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్‌తో పక్షపాతానికి ఆస్కారముండేది. ఇప్పుడు సుప్రీం కోర్టు వేసిన స్వతంత్ర దర్యాప్తు సంస్థతో నిజం తేలనుంది. 100 రోజుల పాలన విఫలం కావడంతో చంద్రబాబు చేసిన కుటిల ప్రయత్నం చివరకు ఇలా బెడిసికొట్టింది.

–తమరాన సత్యనారాయణ, వ్యాపారి, రోలుగుంట

ప్రజల సహకారంతో ‘స్వర్ణాంధ్ర-2047’ ప్రణాళిక

- పరిశ్రమలు, పర్యాటకంపై దృష్టి పెట్టండి
- హోం శాఖమంత్రి వంగలపూడి అనిత
- విజన్ ప్లాన్‌పై జిల్లా అధికారులతో సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత, పక్కన కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

తుమ్మపాల: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారానే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి వీలవుతుందని హోం శాఖమంత్రి వంగలపూడి అనిత అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం స్వర్ణాంధ్ర –2047 విజన్ ప్లాన్‌పై అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని, జిల్లాలో అభివృద్ధికి ఎక్కువ అవకాశమున్న పరిశ్రమలు, పర్యాటకం, వ్యవసాయం రంగాలపై లోతుగా ఆలోచించి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని అధికారులు సూచించారు. ఎంతోమంది విలువైన సూచనలు చేశారని, విజన్ ప్రణాళిక ఇప్పటి నుంచి మొదలు పెడితేనే రాబోయే 22 ఏళ్లలో లక్ష్యాలు సాధించడానికి దోహదపడుతుందన్నారు. స్వర్ణాంధ్ర–2047 విజన్ ప్లాన్‌ను ప్రజల భాగస్వామ్యంతో తయారు చేయాలన్నారు. కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 విజన్ కార్యాచరణ ప్రణాళికను ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో తయారుచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల సూచనలు సలహాలు తీసుకోవడానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లభించిన వివరాలపై సూచనలు సలహాలు పొందుపరచాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు 50 వేల మంది ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారని చెప్పారు. సలహాలు స్వీకరించేందుకు అన్ని గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రణాళికాధికారి రామారావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ రంగాల్లో జిల్లా ప్రగతిని, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను వివరించారు. జేసీ జాహ్నవి, డీఆర్వో దయానిధి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అండతో గ్రావెల్ తవ్వకాలు

- పొక్లెయిన్, 6 ట్రాక్టర్లు స్వాధీనం



యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద స్వాధీనపరచుకున్న ట్రాక్టర్లు

యలమంచిలి రూరల్: అధికార టీడీపీ నాయకుల అండతో పోలవరం ఎడమ ప్రధాన కాల్వ వద్ద సాగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై యలమంచిలి రూరల్ పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. తవ్వకాలు జరుపుతున్న ప్రాంతంలో ఉన్న పొక్లెయిన్, 6 ట్రాక్టర్లను స్వాధీనపరచుకున్నారు. దీనికి సంబంధించి యలమంచిలి రూరల్ ఎస్సై ఉపేంద్ర, ప్రత్యక్ష సాక్షులు తెలియజేసిన వివరాల ప్రకారం.. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి వెంకటాపురం గ్రామానికి సమీపంలో గురువారం రాత్రి పోలవరం ఎడమ ప్రధాన కాల్వ గట్టు వద్ద నుంచి భారీ గ్రావెల్ తవ్వి, అక్రమంగా ఓ ప్రదేశానికి తరలించడానికి ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం అగ్రహారానికి చెందిన ఓ టీడీపీ నేత ఇచ్చిన హామీతో కొందరు వాహనాలు సిద్ధం చేసి, తవ్వకాలు జరుపుతున్నారు. ఈ సమాచారం అందుకున్న యలమంచిలి రూరల్ ఎస్సై సిబ్బందితో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్నట్టు నిర్ధారించుకున్న ఎస్సై పొక్లెయిన్, 6 ట్రాక్టర్లను స్వాధీనపరచుకున్నారు. అధికార పార్టీకి చెందిన తమ ట్రాక్టర్లనే పట్టుకుంటారా.. అంటూ అక్రమ తవ్వకాలను హామీ ఇచ్చిన అగ్రహారానికి చెందిన టీడీపీ నేత పోలీసుల ఎదుట అసహనం వ్యక్తం చేశాడు. అయినప్పటికీ ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావడంతో పోలీసులు ట్రాక్టర్లను, పొక్లెయిన్‌ను స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాలన్నింటినీ తదుపరి చర్యల నిమిత్తం యలమంచిలి తహసీల్దార్‌కు అప్పగించామని ఎస్సై ఉపేంద్ర శుక్రవారం రాత్రి సాక్షికి తెలిపారు. దీనిపై తహసీల్దార్ వరహాలును సంప్రదించగా పోలీసుల దగ్గర్నుంచి సమాచారం వచ్చిందని, గనుల శాఖకు అప్పగించాలా? లేక తామే చర్యలు తీసుకోవాలా? అన్నది శనివారం నిర్ధారించుకున్న తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అనధికార క్వారీలను సీజ్ చేయండి

- న్యాయమూర్తి ఆదేశం



క్వారీ వివరాలను తెలుసుకుంటున్న జడ్జి

మాకవరపాలెం: అనధికార రాయి క్వారీలను సీజ్ చేయాలని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని బోడిమెట్ట రాయి క్వారీని ఆయన శుక్రవారం పరిశీలించారు. క్వారీ విస్తీర్ణం, ఇప్పటివరకు ఎంతమేర రాయిని పేల్చారనే విషయాలను తెలుసుకున్నారు. సర్వే నంబర్ 30లో 40 ఎకరాల నల్లరాయి ఉందని, గత కొన్నేళ్లుగా సుమారు 8 ఎకరాల వరకు రాయిని పేల్చి తరలించినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రస్తుతం అనుమతులు లేవని చెప్పడంతో క్వారీ వద్ద ఉన్న ట్రాక్టర్ తొట్టితో పాటు క్వారీని సీజ్ చేయాలని డీటీ సోమశేఖర్, ఎస్ఐ దామోదర్‌నాయుడులకు ఆదేశాలిచ్చారు. ఆయన వెంట వీఆర్వో లక్ష్మణరావు, న్యాయవాదులు ఉన్నారు.

అల్పజీవులం.. మా పొట్ట కొట్టకండి

- ఇసుక అందుబాటులో లేక పనులకు ఆటంకం
- జిల్లా అంతటా భవన నిర్మాణ కార్మికుల నిరసన
- గబ్బాడ డిపోలో ఇసుక పంపిణీ చేయాలని డిమాండ్



నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు



అనకాపల్లిలో భవన నిర్మాణ కార్మికుల నిరసన ప్రదర్శన

నర్సీపట్నం/తుమ్మపాల: పనులు లేక అల్లాడుతున్నారు.. కుటుంబాలు పస్తులుంటున్నాయి.. అందుకే ఆకలేసి కేకలేశారు.. భవన నిర్మాణ కార్మికులు జిల్లాలో పలుచోట్ల నిరసనలకు దిగారు.. నర్సీపట్నంలో కృష్ణాబజార్ నుంచి శ్రీకన్య కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అబిడ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు హోరెత్తించారు. ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇసుక కొరతతో కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారని, ఉచిత ఇసుక ఇవ్వకపోగా ఇసుకే లేని పరిస్థితి దాపురించిందన్నారు. కార్మికులు తీవ్రమైన సమస్యతో బాధపడుతుంటే సీఎం, డిప్యూటీ సీఎం లడ్డూ చుట్టూ తిరగడం సరికాదన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ గబ్బాడ ఇసుక డిపోలో 48 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలపై విచారణ పూర్తి చేసినప్పటికీ ఇసుక సరఫరా చేయలేదన్నారు. గోదావరి ఇసుక ధర విపరీతంగా పెరిగిందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కె.రామకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని సర్వకామదాంబ పార్కు, గవరపాలెంలలో జరిగిన కార్యక్రమాల్లో సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరాం, సభ్యులు పెంటకోట శ్రీనివాసరావు, బొప్పె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చి సరఫరా చేయాలన్నారు. అనకాపల్లిలో ఇసుక పాయింట్ లేదని, దీంతో దూరంగా ఉన్న నక్కపల్లి నుంచి ఇసుకు తీసుకురావలసిన పరిస్థితి ఉందన్నారు. గతంలో వలె అనకాపల్లి సమీపంలో ఉన్న కోడూరు డిపో ద్వారా ఇసుక సరఫరా చేయాలన్నారు.

క్లుప్తంగా

మైనింగ్ శాఖ ఏడీగా శివాజీ



నర్సీపట్నం: మైనింగ్‌శాఖ సహాయ సంచాలకుడిగా (ఏడీ) జి.శివాజీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఏడీ రవికాంత్ రాజమండ్రికి బదిలీ అయ్యారు. శివాజీ గుంటూరు నుంచి బదిలీపై వచ్చారు. తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికంగా ఇసుకను తెచ్చుకునేందుకు వీలుగా రెవెన్యూ అధికారులతో మాట్లాడి రీచ్‌లు గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నక్కపల్లి డిపో నుంచి ప్రభుత్వ ఇసుకను సరఫరా చేస్తున్నామన్నారు. గబ్బాడ ఇసుక డిపోలో త్వరలోనే ఇసుక పంపిణీ చేపడతామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే డిపోల ద్వారా ఇసుక పొందవచ్చన్నారు.

అటవీ భూముల పరిరక్షణే లక్ష్యం

- డిప్యూటీ ఫారెస్ట్ కన్జర్వేటర్ ఎం.శామ్యూల్



నర్సీపట్నం: జిల్లాలో అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకుంటానని డిప్యూటీ ఫారెస్ట్ కన్జర్వేటర్ ఎం.శామ్యూల్ తెలిపారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది, పలువురు రేంజ్ అధికారులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం శామ్యూల్ విలేకర్లతో మాట్లాడుతూ అటవీ భూములు పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడతానన్నారు. అటవీ వనాల అభివృద్ధిపై కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

నేడు, రేపు బస్ పాసుల జారీ నిలిపివేత

కశింకోట: ఆర్టీసీ బస్ పాసులు జారీ చేసే వెబ్‌సైట్‌ను ఆధునీకరిస్తున్న దృష్ట్యా శని, ఆదివారాల్లో కౌంటర్లలో బస్ పాసులు జారీ నిలిపివేస్తున్నట్లు ఆర్టీసీ డీపీటీవో కె.పద్మావతి తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం ఆర్టీసీ డిపోల్లోని బస్ పాసు కౌంటర్లు తెరవబోమని పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి కౌంటర్లలో బస్ పాసుల జారీ యథావిధిగా సాగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు, విద్యార్థులు గమనించాలని కోరారు.



అనకాపల్లిలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో సరస్వతి దేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



బాలా త్రిపుర సుందరి దేవిగా గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ



మునగపాక మండలం ఒంపోలులో గాయత్రి దేవీ అవతారంలో దుర్గాదేవి అమ్మవారు



వంటర్లపాలెంలో గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

దుర్గమ్మా నమోస్తుతే

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం దుర్గమ్మ ప్రత్యేక అలంకరణలో కనువిందు చేసింది. వాడవాడలా ప్రత్యేక మండపాల్లో కొలువైన అమ్మవారు పలు చోట్ల గాయత్రీదేవిగా, బాలాత్రిపుర సుందరిదేవీగా దర్శనమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కూటమి తీరుతో నిర్మాణ రంగం కుదేలు

- రోడ్డున పడ్డ భవన నిర్మాణ కార్మికులు
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వంలో నిర్మాణ రంగం కుదేలైందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక పేరుతో ప్రభుత్వం ప్రజలను వంచించిందని, ప్రభుత్వ విధానంతో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నర్సీపట్నం నియోజకవర్గం ఇసుక డిపోలో నిల్వలు ఉన్నప్పటికీ నాలుగు నెలలుగా పంపిణీ చేయకపోవడంతో నిర్మాణదారులు, భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అభివృద్ధి చేస్తే ఎందుకు ఓడిపోయారని టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎంతో అభివృద్ధి చేశామని చెబుతున్న మిమ్మల్ని 2019 ఎన్నికల్లో ప్రజలు ఎందుకు ఓడించారో సమాధానం చెప్పాలన్నారు. 2014 నుంచి 2019 వరకు మంత్రిగా పని చేసిన అయ్యన్నపాత్రుడు కంటే శాసనసభ్యుడిగా ఐదేళ్ల కాలంలో మున్సిపాలిటీ అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు తీసుకువచ్చానని స్పష్టం చేశారు. అధికారం ఉంది కదాని ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించేది లేదన్నారు. రూ.18 కోట్లతో ఏరియా ఆస్పత్రిలో అదనపు భవనాలు, మెయిన్ రోడ్డు విస్తరణ, 30 అడుగుల రోడ్డు విస్తరణ, మెయిన్ రోడ్డు సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. మీకు చేతనైతే మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న బాక్సింగ్ క్రీడాకారుల కోసం బాక్సింగ్ రింగ్ నిర్మాణానికి అప్పటి కలెక్టర్ రూ.55 లక్షలు మంజూరు చేస్తే, పనులు మొదలు పెట్టారన్నారు. బాక్సింగ్ రింగ్ నిర్మించే స్థలం అభ్యంతరమైతే వేరే చోట నిర్మించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఆ నిధులను వేరే దానికి మళ్లిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, కర్రి శ్రీనివాసరావు, దాడి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పడకల సంఖ్య పెంచండి

- కేజీహెచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్‌ను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాయంత్రం కేజీహెచ్‌కు వెళ్లిన ఆయన ముందుగా వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఉద్యోగుల విధి నిర్వహణ, సిబ్బంది జీతభత్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నపిల్లల వార్డును సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. ఆధునికీకరణ, ఇతర పనుల గురించి కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, ఇతర వైద్యాధికారులతో మాట్లాడారు. ఖైదీలకు కేటాయించిన బెడ్లు సరిపోవడం లేదని ఇటీవల కేంద్ర కారాగారం సందర్శనలో అక్కడి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయమై అధికారులతో చర్చించారు. రాజేంద్రప్రసాద్ వార్డులో ఇప్పుడున్న బెడ్ల సంఖ్యను పెంచాలని, ఖైదీలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ వార్డులను పరిశీలించారు. వైద్యసేవల విస్తరణ, వసతుల కల్పన, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏఎంసీ యూనిట్-2 కౌన్సెలింగ్ రూమ్‌ను కూడా కలెక్టర్ సందర్శించారు. పర్యటనలో ఐసీడీఎస్ పీడీ జయదేవి, ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ నాయుడు, కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, డీఈఈ మన్మథరావు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

- నునపర్తిలో మూడు రోజుల పాటు నిర్వహణ

అచ్యుతాపురం(మునగపాక): మండలంలోని నునపర్తి గ్రామం 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ అండర్-19 బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు వేదిక కానుంది. శనివారం నుంచి సోమవారం వరకు శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేసినట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొంప నరసింహ నాయుడు తెలిపారు. 13 ఉమ్మడి జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో తలపడనున్నారని పేర్కొన్నారు. 7న విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదపూడి శంకరరావు, క్లబ్ చైర్మన్ ఆర్‌వీవీ నగేష్ తెలిపారు.

నేత్రపర్వంగా వెంకన్న ధ్వజారోహణం



ఉపమాక ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ధ్వజపటాన్ని ఎగుర వేస్తున్న అర్చక స్వాములు



స్వామివారికి తిరువీధి సేవ

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం నిత్య కార్యక్రమాలు నిర్వహించారు. విశేష ప్రసాద నివేదనలు పూర్తిచేసి భూదేవి, శ్రీదేవి సమేత కల్కి వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను, సుదర్శన పెరుమాళ్లను (చక్రత్తాళ్వార్) పెద్ద పల్లకిలో ఉంచి భేరీ పూజ నిర్వహించారు. అనంతరం ఆలయంలో అష్ట దిక్పాలకులకు ప్రత్యేక ఆహ్వానం పలుకుతూ గ్రామ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ధ్వజపటాన్ని ఎగుర వేసి స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తజనంతోపాటు, అష్ట దిక్పాలకులు కూడా ఆహ్వానం పలికినట్టు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు. గరుడ పొంగలి నివేదన చేసి భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టారు. సాయంత్రం సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో అధిష్టింపజేసి గ్రామ బలిహరణలు పూర్తి చేశారు. రాత్రి నాలాయిర సేవాకాలంలో శేషతల్ప వాహనంపై స్వామివారి తిరువీధి సేవ నిర్వహించారు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో గోదాదేవి అమ్మవారికి ప్రతి రోజు సాయంత్రం లక్ష్మీ సహస్ర కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అర్చకులు తెలిపారు.

నైపుణ్యాలు మెరుగుపడేలా బోధన అవసరం

- హోం మంత్రి అనిత
- ముగిసిన సీబీఎస్‌ఈ క్లస్టర్-7 పోటీలు



విద్యార్థులకు మెమెంటో అందిస్తున్న మంత్రి అనిత

పాయకరావుపేట: సీబీఎస్‌ఈ క్లస్టర్-7 పోటీలు శుక్రవారం ముగిశాయి. శ్రీప్రకాష్ విద్యా సంస్థలో జరిగిన ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 100కు పైగా స్కూళ్ల నుంచి సుమారు 1200 మంది క్రీడాకారులు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ నైపుణ్యాలను మెరుచుపరుచుకునే దిశగా విద్యా బోధన సాగాలన్నారు. విద్యార్థులు చదివితేనే తెలివైన వారని అనుకుంటే పొరపాటేనని, ఏ రంగంలో రాణించినా తెలివైనవారేనని గుర్తించుకోవాలన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.సూర్యారావు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు హోంమంత్రి అనితను ఘనంగా సన్మానించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, వివిధ పాఠశాలల విద్యార్థులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, తుని, పాయకరావుపేట, చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

కబడ్డీ అండర్ -14

ప్రథమ బహుమతి: శ్రీప్రకాష్ విద్యానికేతన్, పాయకరావుపేట, అనకాపల్లి జిల్లా

ద్వితీయ బహుమతి : న్యూ డైమెన్షన్ హైస్కూల్, భువనగిరి, యదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణా

అండర్ - 17

ప్రథమ బహుమతి : హీల్ స్కూల్, నరసింగపాలెం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్

ద్వితీయ బహుమతి : ప్రభోదానంద ప్రశాంతి నికేతన్, కొండాపూర్, మేడ్చల్ జిల్లా

అండర్-19

ప్రథమ బహుమతి : హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, ఖమ్మం జిల్లా , తెలంగాణా

ద్వితీయ బహుమతి : ది హార్ట్ ఫుల్ లెర్నింగ్ సెంటర్, హైదరాబాద్- తెలంగాణా

వాలీబాల్ అండర్ - 14

ప్రథమ బహుమతి : సంఘ మిత్ర స్కూల్ , నిజాంపేట్, కూకట్‌పల్లి, మేడ్చల్ జిల్లా, తెలంగాణా

ద్వితీయ బహుమతి : డీఏవీ పబ్లిక్ స్కూల్, కూకట్‌పల్లి, మేడ్చల్ జిల్లా- తెలంగాణా

అండర్ - 17

ప్రథమ బహుమతి : నవనీత పబ్లిక్ స్కూల్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

ద్వితీయ బహుమతి : మాంటిస్సోరి ఎలైట్ స్కూల్, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్

అండర్ - 19

ప్రథమ బహుమతి : డీపీఎస్ పబ్లిక్ స్కూల్, నాచారం, మేడ్చల్ జిల్లా, తెలంగాణా

ద్వితీయ బహుమతి : అక్షర విద్యాలయ, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

181 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయితో పోలీసులు

గొలుగొండ: ఏజెన్సీ నుంచి ఆటోలో తరలిస్తున్న 181 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్లు కృష్ణదేవిపేట ఇన్‌చార్జి ఎస్ఐ భీమరాజు తెలిపారు. జీకే వీధి నుంచి గెమ్మిలి కిరణ్, తంబేలి మల్లేస్, పాంగి శాంతి, గెమ్మిలి రవి ఆటోలో గంజాయి తరలిస్తుండగా కృష్ణదేవిపేట సమీప అల్లూరి పార్కు వద్ద పట్టుబడ్డారు. ఆటోలు 181 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, నలుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల నుంచి నాలుగు సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

గంజాయి, సారా నిర్మూలనకు చర్యలు



జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ అధికారి సుధీర్

నర్సీపట్నం: జిల్లాలో గంజాయి, సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ అధికారి వి.సుధీర్ తెలిపారు. శుక్రవారం నర్సీపట్నం ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం మద్యం దుకాణాలకు టెండర్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లాలో 136 దుకాణాలకు నేటి వరకు 20 దరఖాస్తులు వచ్చాయన్నారు. లూజ్ అమ్మకాలు జరిపితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. వ్యసనపరుల కోసం నర్సీపట్నం పరిధిలో వ్యసన విముక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామన్నారు. మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నవోదయ కార్యక్రమం ద్వారా జిల్లాలో సారా రహిత గ్రామాలను తీర్చిదిద్దుతామన్నారు.

పశువుల అక్రమ తరలింపుపై కొరడా



పోలీసులు పట్టుకున్న లారీ

నక్కపల్లి: పశువుల అక్రమ తరలింపుపై పోలీసులు కొరడా ఝుళిపించారు. విజయనగరం నుంచి విజయవాడ వైపు అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీని శుక్రవారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు వేంపాడు టోల్ ప్లాజా వద్ద సీఐ కుమారస్వామి ఈ లారీని తనిఖీ చేసి, 36 పశువులు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి, లారీని సీజ్ చేశామని పోలీసులు తెలిపారు.

ఎస్.రాయవరం: మండలంలో జాతీయ రహదారిపై వ్యాన్‌లో తరలిస్తున్న గోవులను శుక్రవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కంచిలి నుంచి హనుమాన్ జంక్షన్‌కు వ్యాన్‌లో 55 గోవులను తరలిస్తుండగా అడ్డురోడ్డు పి.ధర్మవరం సమీపంలో పట్టుకున్నారు. ఆవులను పాయకరావుపేట మార్కెట్ యార్డుకు తరలించి రైతు సంరక్షణలో ఉంచారు. గోవులను తరలిస్తున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులకు నోటీసులు

- 15 రోజులు సస్పెండ్ చేయనున్నట్లు వెల్లడించిన ఏయూ

ఎంవీపీకాలనీ : ఏయూలో ర్యాగింగ్ వ్యవహారంపై వర్సిటీ యంత్రాంగం ఎట్టకేలకు స్పందించింది. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు దిశగా ముందడుగేసింది. ర్యాగింగ్‌కు పాల్పడిన ఆర్కిటెక్చర్ సీనియర్ విద్యార్థులకు నోటీసులిచ్చింది. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పాటు 15 రోజుల పాటు వారిని వర్సిటీ నుంచి సస్పెండ్ చేయనున్నట్లు వెల్లడించింది. వర్సిటీ ఆర్కిటెక్చర్ విభాగానికి చెందిన సీనియర్ విద్యార్థినులు జూనియర్ విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. జూనియర్ విద్యార్థినుల చేత సీనియర్ విద్యార్థినులు డాన్సులు చేయిస్తూ వీడియోలు చిత్రీకరిస్తున్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల మహిళ వసతిగృహంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మీడియా ద్వారా ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారు అప్రమత్తమయ్యారు. రాత్రి ఒక టీమ్‌ని హాస్టల్‌కు పంపించి నిర్ధారించుకోవడంతో పాటు సీనియర్ విద్యార్థులను మందలించింది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు శుక్రవారం సమీక్షించడంతో పాటు ఏయూ రెక్టార్ ఆచార్య కిషోర్‌బాబు, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఈశ్వర్‌కుమార్, ఆచార్య రేవతిలు విభాగ విద్యార్థులతో సమావేశమయ్యారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులకు నోటీసులు ఇవ్వడంతో పాటు వారి వ్యవహారశైలిని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శిగా వరప్రసాద్



విశాఖ విద్య: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శిగా శెట్టి వరప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గోపాలపట్నం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు వ్యవహరించారు. సమావేశంలో అనకాపల్లి జిల్లా, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మట్ట శ్రీనివాసరావు, యాసపోగు సుధాకర్ రావు, పాడేరు జిల్లా అధ్యక్షుడు జి చిన్నారావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత రావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి మహదేవ్, జోసెఫ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట ఎస్ఐ రామకృష్ణకు డీజీపీ ప్రశంసలు



డీజీపీ తిరుమలరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రోలుగుంట ఎస్ఐ రామకృష్ణ

రోలుగుంట: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన స్థానిక ఎస్ఐ రామకృష్ణకు డీజీపీ తిరుమలరావు ప్రశంసా పత్రం అందజేశారు. మాకవరపాలెం మండలం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా రామకృష్ణ గత నెల రోలుగుంట వచ్చారు. మాకవరపాలెం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో హత్య కేసులు ఛేదించి నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ చూపారు. ఆయన సేవలను గుర్తించి, శుక్రవారం మెమెంటో అందజేశారు.

ధనలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి




లక్ష చామంతుల పూజలో ధనలక్ష్మిగా కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్(విశాఖ): శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. లక్ష చామంతులతో పూజ చేశారు. లక్ష చామంతుల పూజ అలంకరణ దాతలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం ధాన్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారని, లడ్డూలతో పూజ నిర్వహిస్తామని ఈవో కె.శోభారాణి తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు గర్భాలయ ప్రవేశం లేదన్నారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


నేడు కేంద్ర, రాష్ట్రమంత్రుల రాక

మహారాణిపేట(విశాఖ): కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహననాయుడు , రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ శనివారం విశాఖ వస్తున్నారు. తిరుపతి నుంచి విమానంలో శనివారం సాయంత్రం రామ్మోహననాయుడు విశాఖ చేరుకుని, ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా కళాభారతి ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 8 గంటలకు రోడ్డు మార్గం ద్వారా శ్రీకాకుళం వెళతారు. రాష్ట్ర మంత్రి దుర్గేష్ రాజమండ్రి నుంచి రోడ్డు మార్గంలో శనివారం 10.30 గంటలకు రుషికొండలో రాడిసన్ హోటల్‌కు చేరుకుంటారు. గోల్ఫ్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేస్తారు. ఆదివారం రుషికొండ తదితర ప్రాంతాల్లో పర్యటించి, 7వ తేదీన రాజమండ్రి వెళతారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



శేషుబాబు (ఫైల్)



మృతుడు మదీనా

నక్కపల్లి: మండలంలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గురువారం సాయంత్రం నక్కపల్లి బస్టాండ్ వద్ద మనబానవానిపాలెం గ్రామానికి చెందిన గొర్ల శేషుబాబు(50) మోటారు సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా విశాఖవైపు వెళ్తున్న బోలెరో వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం దుర్మరణం పాలయ్యాడు.

- యలమంచిలి మండలం రేగుపాలెం గ్రామానికి చెందిన షేక్ మదీనా(83) తన బంధువు అబ్దుల్ ఖాదర్‌తో కలిసి పింఛన్ తీసుకునేందుకు తుని మోటారు సైకిల్‌పై వెళ్లారు. గొడిచర్ల వద్ద వారి బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి తుని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మదీనా మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

నూకాంబిక సన్నిధిలో చండీ హోమం



హోమంలో పాల్గొన్న అర్రెపు కామేశ్వరరావు, దాడి జయవీర్

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండవ రోజు అమ్మవారికి మాతృ త్రయోరాధన, చండీ హోమం ఘనంగా నిర్వహించారు. రెండవ రోజు ఉచిత భోజనం విరాళదాతలు అర్రెపు కామేశ్వరరావు, లలిత, సాయినాథ్, లక్ష్మీదీప్తి సహకారంతో భక్తులకు అన్నప్రసాదం అందించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శనాలు చేసుకున్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.సుజాత, గౌరీ వ్యాయామశాల అధ్యక్షుడు దాడి జయవీర్, భక్తులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

అనకాపల్లి: మండలంలోని రేబాక గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. రేబాక గ్రామానికి చెందిన ఎం.సత్తిబాబు బెల్టు దుకాణం ద్వారా మద్యం విక్రయిస్తుండగా శుక్రవారం పట్టుకున్నామన్నారు. 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలపై సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని కోరారు.

గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ

పరవాడ: ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న పరవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త రాధాకృష్ణ శుక్రవారం కాలు జారి పడిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. ఈయన కాలికి అయిన గాయానికి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాధాకృష్ణను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పైల హరీష్, వర్రి హరిలు శుక్రవారం పరామర్శించారు. ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం శుక్రవారం 191 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,690	5,280
రెండో రకం	3,500	4,400
మూడోరకం	3,100	3,310

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
రామనగర్ బన్నీ	: సత్యనారాయణ స్క్రీన్-1
మిస్టర్ సెలబ్రిటీ	: సత్యనారాయణ స్క్రీన్-2
కాళి	: పద్మిసాయి
సత్యం సుందరం	: షిర్డిసాయి
దక్షిణ	: వెంకటేశ్వర
మన్మథ	: శ్రీసత్య
శ్వాగ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-24 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాటిజివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 345 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

కూటమి పాలనలో.. కూర'గాయాలు'

- కొండెక్కిన కూరగాయల ధరలు
- అదే బాటలో వంట నూనెల ధరలు
- ధరలు పెంచి వంద రోజుల పండగలా?
- వంద రోజులకే ఆకాశాన్నంటిన టమాటా, ఉల్లి
- బెంబేలెత్తిపోతున్న పేద, మధ్యతరగతి ప్రజలు
- కూటమి ప్రభుత్వ తీరుతో సామాన్యుల ఆవేదన

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులకే కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. నిత్యావసరాలు సామాన్యుడికి భారంగా మారాయి. సీఎం చంద్రబాబు పాలనలో ముస్ముందు ఇంకెన్నింటి ధరలు అందుబాటులో లేకుండా పోతాయో నని ప్రజలు భయపడుతున్నారు. టమాటా, ఉల్లి ధరల్ని చూసి తారెత్తిపోతున్నారు. ధరల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఇంత నిర్లిప్తంగా ఉండటం సరికాదని వాపోతున్నారు.



కూరగాయల దుకాణం



కొండెక్కిన టమాటాలు

తుమ్మపాల: పేదలంటే చంద్రబాబుకు ఎప్పుడూ చులకనే. తనదంతా పెత్తందార్లు, కార్పొరేటర్ల అను'కుల'పాలనే అన్నది జగమెరిగిన సత్యం. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలన వందరోజులు దాటింది. ఈ కాస్త సమయంలోనే గతంలో ఎన్నడూ లేనంత స్థాయికి కూరగాయల ధరలు చేరుకున్నాయి. నిత్యావసరాలూ నింగినంటాయి. ధరల కట్టడికి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఆ దిశగా కనీస చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. దీంతో ప్రజలు లబోదిబోమంటున్నారు.

దిగుమతి సుంకాలపైనే ధ్యాస

దిగుమతి పేరుతో ఉల్లి, బంగాళదుంప, వెల్లుల్లిపై సుంకాలు వసూలు చేస్తున్న ప్రభుత్వం, ధరలు భరించలేనంత స్థాయికి చేరుకుంటున్నా నిద్ర నటిస్తోంది. నెలరోజుల వ్యవధిలో అన్ని కూరగాయల ధరలు దాదాపు రెట్టింపయ్యాయి. చేతినిండా డబ్బులు పట్టుకెళ్లినా సంచి నిండా కూరగాయలు రావట్లేదని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే కార్తీకమాసం, డిసెంబర్ వరకూ పండగలు, శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో ముస్ముందు ధరల మోత ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో కూరగాయల ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు చెప్తున్నారు.

ఉత్పత్తి తగ్గి.. ధరలు పెరిగి

కూరగాయాల దుకాణాలకు మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయలు, మన రాష్ట్రంలో పుంగనూరు, పలమనేరు నుంచి టమాటా, కోల్‌కతా, ఇండోర్ నుంచి బంగాళాదుంపలు, ఒడిశా నుంచి పచ్చిమిర్చి, తెలంగాణ నుంచి బీట్రూట్, క్యాప్సికమ్, క్యాబేజీ, రావులపాలెం నుంచి దొండకాయలు, దోసకాయలు ఎక్కువగా వస్తుంటాయి. ఆయా ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా కురవడంతో పంటలకు నష్టం వాటిల్లింది. దాంతో ఉత్పత్తి తగ్గి సరఫరా లేకపోవడంతో కూరగాయలు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనూ ఈ పరిస్థితి తలెత్తినా.. ప్రభుత్వమే రాయితీపై ఉల్లి, టమాటాలను విక్రయించేది. కూటమి ప్రభుత్వం మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవట్లేదు.

మరుగుతున్న వంట నూనెలు

ఎడిబుల్, క్రూడాయిల్ దిగుమతులపై టాక్స్ పెంపు వంట నూనెల ధరలపై ప్రభావం చూపింది. రిఫైండ్ ఆయిల్‌పై పన్ను 13.75 శాతం నుంచి 35.75 శాతానికి, క్రూడాయిల్‌పై 5.5 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీ 27.50 శాతానికి పెంచడంతో ఒక్కసారిగా ఆయిల్ ధరలు భగ్గుమన్నాయి. నెల రోజుల వ్యవధిలోనే లీటర్ ఆయిల్ ప్యాకెట్‌పై రూ.19 నుంచి రూ.25 వరకు ధర పెరగడం పేదవర్గాల వారికి భారంగా మారింది. వినియోగదారుల అవసరాలను అసరాగా చేసుకుని కొంతమంది వర్తకులు కృత్రిమ కొరత సృష్టించి కాసులు దండుకుంటున్నారు. ఈ వ్యవహారంపై కొరడా ఝళిపించాల్సిన అధికారుల జాడ అంతంత మాత్రంగా ఉండడంతో ప్రజలకు ధరల భారం మోయక తప్పడం లేదు.

కూరగాయలు ధరలు కిలోల్లో

కూరగాయి పేరు	ప్రస్తుత ధర	3 నెలల క్రితం ధర
టమాటా	90	40
ఉల్లిపాయలు	70	35
బీరకాయలు	80	40
క్యాప్సికమ్	80	60
కాకర	70	100
బంగాళాదుంప	40	20
మిర్చి	50	40
చిక్కుడు	100	50
బీన్స్	100	40
దొండకాయలు	50	20
బెండకాయలు	40	30
వంకాయలు	60	30
వెల్లుల్లి	280	120
అల్లం	120	150

10 రోజులుగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి

పది రోజల నుంచి కూరగాయల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. వర్షాల వల్ల ధరలు పెరిగాయనుకున్నాం. ఇప్పుడు వర్షాల్లేవు. రైతుల దగ్గర లేని ధరలు దళారుల దగ్గరకు వెళ్లేసరికి పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం దృష్టి పెట్టి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. గతంలో రూ.300తో సంచి నిండా కూరగాయలు వచ్చేవి. కనీసం 10 నుంచి 15 రోజులు సరిపోయేవి. ఇప్పుడు రూ.500 పెట్టినా వారానికి సరిపడా కూరగాయలు రావట్లేదు.

– కె.లక్ష్మి, అనకాపల్లి

కూరగాయలు కొనలేకపోతున్నాం

రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు మావి. నిత్యావసర సరకులతో పాటు వంట నూనె, కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దాంతో మార్కెట్లో గతంలో కిలోల్లో కొనే కూరగాయల్ని ఇప్పుడు అరకిలో.. పావు కిలోల్లెక్కన కొనుక్కుంటున్నాం. రెండు మాసాల నుంచి టమాటా కొనుగోలు చేయాలంటే భయపడుతున్నాం. ఇప్పుడు ఉల్లి ధరలూ కొండెక్కాయి. తప్పని స్థితిలో కిలో ఉల్లి రూ.70కి కొనుగోలు చేస్తున్నాం.

– కనిశెల్ల రాము, గురజాడనగర్

బూడికి అభినందనల వెల్లువ



బూడి ముత్యాలనాయుడుకు శుభాకాంక్షలు తెలిపిన యువజన విభాగం నాయకులు

తుమ్మపాల: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును పట్టణానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. దేవరాపల్లి మండలం తారువ గ్రామంలోని బూడి నివాసంలో ఆయన్ని కలిసి దుశ్శాలువాలతో సత్కరించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి యువజన విభాగం కీలక పాత్ర వహించేలా కృషి చేయాలని బూడి చెప్పారని, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎం.నాయుడు తెలిపారు. బూడిని కలిసిన వారిలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నూరు నాయుడు, రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ లక్ష్మీనరసింహారావు, ప్రధాన కార్యదర్శి బండారు శ్రావణ్, జిల్లా కార్యదర్శి పిల్లా రాజు, ప్రభాకర్, ఉగ్గిన అప్పారావు, పల్లెల సాయి, నరేష్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'గవర్ల రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలి'



గవర సంక్షేమ యువజన సంఘం నూతన కమిటీతో ఇతర సభ్యులు

కశింకోట(అనకాపల్లి): బీసీలుగా ఉన్న గవర కులస్తులకు స్థానిక సంస్థలు, ఇతర రంగాల్లో రిజర్వేషన్ పక్కాగా అమలు చేయాలని గవర సంక్షేమ సంఘం కోరింది. గవరపాలెంలో శుక్రవారం సంఘ వ్యవస్థాపకుడు బుద్ధ భూలోకనాయుడు ఆధ్వర్యంలో నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు అధ్యక్షతన సంఘ సమావేశం నిర్వహించారు. సంఘానికి మూల నిధి సమకూర్చి పేద గవర కులస్తులకు ఆర్థిక సాయం చేసి, ఆదుకోవాలని పిలుపునిచ్చారు. డిసెంబర్‌లో 30 వేల మందితో వన సమారాధన నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. సంఘ మహిళా విభాగాన్ని ఏర్పాటు చేయాలని, ప్రాంతాల వారీగా పరిశీలించి పూర్తి స్థాయిలో సంఘ కమిటీని విస్తృత పరచాలని తీర్మానించింది. ఈ సందర్భంగా సంఘ యువజన విభాగం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాడి జోగేంద్రనాయుడు(డీజే), ప్రధాన కార్యదర్శిగా బొడ్డేడ రాజా, కోశాధికారిగా మళ్ల గోపిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, కాండ్రేగుల అప్పారావు(కెప్టెన్), విల్లూరి శ్రీనివాసరావు, కొణతాల చంద్ర, కొణతాల రత్నకుమారి, యల్లపు శ్రీను, మళ్ల శ్రీనివాసరావు, సూరిశెట్టి నరసింగరావు(పైసా), కాండ్రేగుల విశ్వేశ్వరరావు, బొడ్డేడ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తుమ్మపాల: టెక్నాలజీ పెరిగేకొద్దీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని సోషల్ మీడియా సెల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు ఆయనతోపాటు, ఐటీ కోర్ ఎస్ఐ బి.సురేష్ బాబు, అనకాపల్లి టౌన్ సీఐ టీవీ విజయ్‌కుమార్‌లు అనకాపల్లి పట్టణంలోని హిమశేఖర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్స్ వల్ల జరిగే అనర్థాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో జరిగే వివిధ రకాల మోసాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల చోరీలు, పిన్ నంబరు కొట్టేసి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు కాజేయటం వంటి వాటిని వివరించారు. అజ్ఞాత వ్యక్తులు ఫోన్‌లో తీయని మాటలు చెప్పి, మభ్యపెట్టి నగ్న చిత్రాలతో బెదిరించి, డబ్బులు దోచేస్తున్నారని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాజాగా 'డిజిటల్ అరెస్ట్'వంటి కొత్త నేరాలూ వెలుగులోకి వస్తున్నాయన్నారు. బ్యాంకు ఖాతా, సిమ్ కార్డు, ఆధార్ కార్డు వంటివి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వినియోగించుకున్నారని బెదిరిస్తూ, విచారణ పూర్తయ్యేంతవరకూ అక్కడి నుంచి కదలటానికి వీల్లేదని కట్టడి చేస్తారని, బలవంతంగా డబ్బులు గుంజుతున్నారని వాటిపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

సబ్బవరం/పరవాడ: మండలంలో పలు శాఖల అధికారులు సాధారణ బదిలీల్లో భాగంగా సబ్బవరం వచ్చి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్బవరం ఈవోపీఆర్డీగా బోండా చైతన్య చోడవరం నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. గతంలో జీకే వీధి, చీడికాడ మండలాల్లో పనిచేశారు. ఇక్కడ ఈవోపీఆర్డీగా పనిచేసిన ఒ.మహేష్ బదిలీపై చోడవరం వెళ్లారు.

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా డి.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన అచ్యుతాపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో గొలుగొండ, జి.మాడుగులలో పనిచేసినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేసిన హిమబిందు అనకాపల్లికి బదిలీపై వెళ్లారు.
- సబ్బవరం డిప్యూటీ తహసీల్దార్‌గా సీహెచ్ అప్పారావు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో నాతవరం, అచ్యుతాపురం, రోలుగుంట మండలాల్లో డీటీగా పనిచేశారు. సబ్బవరంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన అనుభవం ఉంది.
- పరవాడ మండల పంచాయతీ విస్తరణాధికారిగా బి.ధర్మారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి ఈవోఆర్డీగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఈవోఆర్డీగా పనిచేసిన కె.రమేష్ నాయుడు భీమిలి బదిలీ అయ్యారు. మండలంలో పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ధర్మారావు తెలిపారు.

బాలాత్రిపురసుందరీం.. సర్వతత్వాత్మకాం

- బాలాత్రిపురసుందరి, సరస్వతి, గాయత్రి అలంకరణలో అమ్మవారు
- ఊరూవాడా అమ్మవారి శరణు ఘోష, అన్నసమారాధనలు

మనసు, బుద్ధి, చిత్తం, అహంకారాలను తన అధీనంలో ఉంచుకున్న శక్తి.. బాలా త్రిపుర సుందరీదేవి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఊరూవాడా వెలసిన అమ్మవారి దేవాలయాల్లో దుర్గమ్మను కొన్ని చోట్ల బాలా త్రిపుర సుందరిగాను, మరికొన్ని చోట్ల సరస్వతి, గాయత్రిగా అలంకరించి, భక్తులు పూజలు చేశారు. దసరా ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ఊరూవాడా అమ్మవారి నామస్మరణతో మార్మోగిపోయింది.



కశింకోట శివాలయంలో కొలువైన సర్వమంగళాంబ



పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తుమ్మపాల: పట్టణంలోని ప్రసిద్ధి చెందిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతిష్టా శతజయంతి ఉత్సవాలు, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. దేవీ నవరాత్రులు రెండవ రోజు అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మండపంలో బేడసేవ, శ్రీ చక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ నిర్వహించారు. సరస్వతి దేవి పూజ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర స్టేషనరీ సామగ్రిని శత జయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కోచైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు. ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తుమ్మపాల: శ్రీ గౌరీ పంచాయతన దేవాలయంలో శుక్రవారం శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, అంపోలు రాంప్రసాద్ శర్మ, కోట శ్రీకర్ శర్మ ఆధ్వర్యంలో రెండవ రోజు సరస్వతీ దేవిగా అమ్మవారిని అలంకరించారు. చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ల మహాలక్ష్మినాయుడు, మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ, ఆళ్ల ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక జాతీయ రహదారి వద్దనున్న కనకదుర్గ ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

- కశింకోట శివాలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా సర్వమంగళాంబ అమ్మవారిని అందంగా పూలమాలలతో అలంకరించి, నూతన వస్త్రాలు ధరింపజేసి ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు. ఆలయ అర్చకుడు వి.చిదంబరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



కశింకోటలో గాయత్రీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

తుమ్మపాల: గవరపాలెం సతకంపట్టులో కొలువైన కనకదుర్గమ్మను నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బాలా త్రిపుర సుందరిగా అలంకరించి, పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి చంద్రశేఖర్, భోగావరపు వెంకటరమణ(బాబు) ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్య పూజలు, అభిషేకాలు జరిగాయి. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆర్థిక సహకారంతో మాలధారణ చేసిన భవానీ భక్తులకు నవరాత్రి పది రోజులు అన్న సమారాధన జరుగుతుందని ఆలయ చైర్మన్ కాండ్రేగుల నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీ పరమేశ్వరి కమిటీ, శ్రీ గౌరీ పరమేశ్వరి ప్రజా టెంట్‌హౌస్, శ్రీ మరిడమాంబ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా పెదముషిడివాడ- ఈ మర్రిపాలెం రోడ్డు



పెదముషిడివాడ- ఈ మర్రిపాలెం రోడ్డు దుస్థితి

పరవాడ: మండలంలోనిపెదముషిడివాడ–ఈ మర్రిపాలెం గ్రామాల మధ్యనున్న మెటల్ రోడ్డు అధ్వానంగా మారడంతో ఇరు గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుకు కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టలేదు. పెదముషిడివాడ పరిసర ప్రాంతాల్లో రాత్రీ పగలు తేడా లేకుండా భారీ వాహనాలతో అక్రమ గ్రావెల్ తరలింపు చేపడుతున్న నేపథ్యంలో రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. నడవడానికియ్యాడా వీల్లేకుండా రోడ్డు తయారయింది. ఏ మాత్రం వర్షం పడినా గోతుల్లో నీరు చేరి, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సుమారు 2 కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ మర్రిపాలెం రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.